క్లుప్తంగా

వరి పంట పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: వరి పంట నష్టపోకుండా రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండలంలో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 102 హెక్టార్లలో సాగు చేయగా, 80 హెక్టార్లలో పంట కోతలు పూర్తయినట్లు చెప్పారు. తుపాను వల్ల దెబ్బతిన్న పంటలను ఆమె పరిశీలించి, నష్టనివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు సలహాలు అందించారు.

9న జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: ఈనెల 9వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అధాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణ కుమార్ కోరారు. బుధవారం చిత్తూరులోని జిల్లా న్యాయసేవా సదన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాజీ చేసుకోదగ్గ కేసులను అదాలత్‌లో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, తిరుపతి, మదనపల్లె ప్రాంతాల్లోని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు.

వికసిత్ భారత్ ప్రత్యేకాధికారి రాక

చిత్తూరు కార్పొరేషన్: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి ఆ యాత్ర జిల్లా ప్రత్యేకాధికారి సచింద్రకుమార్ పట్నాయక్ బుధవారం చిత్తూరుకు వచ్చారు. ఈసందర్భంగా ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా జేసీ శ్రీనివాసులు, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి కలిశారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో ప్రజల చెంతకే మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బుధవారం గోవిందరెడ్డిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 90 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు తవ్వుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని బి.మిట్టూరు గ్రామంలో వీధికి చెందిన కొందరు వ్యర్థ నీటిని వీధిలో వదలుతున్నారని గ్రామస్తులు ఎంపీడీఓ గౌరీవి విన్నవించారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ బుధవారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఇంకుడు గుంతలను నిర్మించడం ద్వారా వ్యర్థ నీరు రోడ్లపై రాకుండా గుంతలోనే ఉంటుందన్నారు. తద్వారా గ్రామస్తులు అనారోగ్య సమస్యల నుంచి బయటపడతారని తెలిపారు. ఇంకుడు గుంతలను నిర్మించుకోకుండా, రోడ్లపై నీళ్లను వదిలేవారిపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, వైస్ సర్పంచ్ ఆనందయ్య పాల్గొన్నారు.

సీపీఆర్‌తో గుండెకు రక్ష

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల భువన విజయం ఆడిటోరియంలో వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి కార్డియో పల్మనరీ రెసుసైటేషన్ (సీపీఆర్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ.. గుండెపోటు ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. గుండె ఆగిపోయినప్పుడు సీపీఆర్ అనేది రోగిని సకాలంలో రక్షించగలదని.. ఎవరికైనా గుండె ఆగిపోయినప్పుడు.. ఎక్కడైనా ఈ చర్యలు తీసుకోవడం ద్వారా అతన్ని రక్షించవచ్చని అన్నారు. రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు, వైస్ ప్రిన్సిపల్ వెంకట్, అనస్థీషియా హెచ్‌ఓడీ రాధా పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం







అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి, పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ రాజశేఖర్



సీపీఐ, సీఐటీయూ నాయకుల నివాళి



నివాళులర్పిస్తున్న మేయర్ అముద





పూతలపట్టు: అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు, తవణంపల్లెలో..

చిత్తూరు రూరల్: భారత రాజ్యాంగ నిర్మాణంలో బీఆర్ అంబేడ్కర్ పాత్రను జాతి ఎన్నటికీ మరిచిపోదని, ఆ మహనీయుడి అడుగు జాడల్లో మనమంతా నడుద్దామని జేసీ శ్రీనివాసులు, ఎస్పీ రిషాంత్ రెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. దర్గా సర్కిల్‌లోని విగ్రహానికి తొలుత జేసీ, ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలు కూడా సామాజిక, ఆర్థిక సాధికారత సాధించాలని జీవితాంతం తపించిన గొప్ప దార్శనికుడు అంబేడ్కర్ అని ప్రశంసించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ జేడీ రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే మేయర్ అముద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తిగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి బడుగు,బలహీన వర్గాలకు రాజ్యాధికారం కట్టబెట్టేలా పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, టిమ్ము, కార్పొరేటర్ లక్ష్మణస్వామి, కో ఆప్షన్ సభ్యుడు కిరణ్, నాయకులు మనోహర్‌రెడ్డి, శివ, ప్రకాష్‌రెడ్డి, నవీన్, రవి, సందీప్ తదితరులు పాల్గొన్నారు. సీపీఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి గజమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాథ్, నాగరాజు, మణి, దాసరి చంద్ర, ఆర్మోగం, గజేంద్రబాబు, రమాదేవి, విజయగౌరి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

చిత్తూరు కలెక్టరేట్: బడుగు,బలహీన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్ అని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జేసీ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఆర్థిక శాస్త్రంలో మొదటి పీహెచ్‌డీ చేసిన వ్యక్తి అంబేడ్కర్ అని అన్నారు. డీఆర్‌ఓ రాజశేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ఓటు హక్కు కల్పించిన మహోన్నతుడు అంబేడ్కర్ అని అన్నారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మీ, ఏఓ కులశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు మరవలేనివి

పూతలపట్టు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు మరవలేనివని వైఎస్సార్ సీపీ పెనుగొండ నియోజకవర్గ పరిశీలకుడు బాబురెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచులు మణి, మాస్లామణి, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, జీవరత్నం, జయపాల్, రామ్మూర్తి, నాగరాజు, షణ్ముగం, వెంకట రమణ పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అబేండ్కర్ వర్ధంతి సందర్భంగా దళిత యువజన సేవా సంఘం మండల సభ్యులు అంబేడ్కర్ విగ్రహానికి గజమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డేవిడ్, దళిత యువజనే సేవా సంఘం నాయకులు మురుగన్, జగన్నాథం, షణ్ముగం, పరదేశి, చిన్నయ్య, రీటాబాబు, అనంతకుమార్, ఏకరాజ్, ప్రకాష్, ప్రభు, జగదీష్, పాల్గొన్నారు.

ఘనంగా పడిమెట్ల పూజ



వసంతాపురం పూజల్లో పాల్గొన్న భక్తులు

గుడిపాల: వసంతాపురం గ్రామంలో బుధవారం రాత్రి అయ్యప్పభక్తులు పడిమెట్ల పూజను ఘనంగా నిర్వహించారు. 18 పడిమెట్లు, అయ్యప్పస్వామి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి దీపారాధన పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 35 మంది అయ్యప్పస్వామి భక్తులు భజన చేశారు. భక్తి కీర్తనలను ఆలపించారు. అన్నదాన చేశారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు

మండలంలోని అడవిచేను గ్రామంలో అయ్యప్పస్వామి ఇరుముళ్ల కార్యక్రమం బుధవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ మధ్యలో అరటిబోదెలు, అరటిపూలతో అందంగా పడిమెట్ల పూజ నిర్వహించి గురుస్వాములు సుబ్రమణ్యం, గోవిందరాజులు ఆధ్వర్యంలో నలభైమంది అయ్యప్ప భక్తులకు ఇరుముళ్లు ధరించారు. మండలం రోజులు నియమ నిష్ఠలతో స్వామిని కొలిచిన ఈ భక్తులు భక్తిపాటలు పాడుతూ శబరిమలైకు బయలుదేరారు.



అడవిచేను గ్రామంలో ఇరుముడులు ధరిస్తున్న భక్తులు

నారగల్లులో ఫ్యామిలీ డాక్టర్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష అన్నారు. నారగల్లు గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. బీపీ, చక్కెర వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం : ఒకరి అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సెబ్ పోలీసులు

గుడిపాల: మద్యం బాటిళ్లు అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ వెంకటరత్నం తెలిపారు. బుధవారం నరహరిపేట చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలో భాగంగా తమిళనాడు నుంచి చిత్తూరుకు వెళ్తున్న సూపర్ స్ప్లెండర్ వాహనాన్ని ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయగా ఎటువంటి బిల్లులు లేని 10 ఆర్మీ మద్యం బాటిళ్లు ఉన్నాయి. నిందితుడు దుర్గానగర్ కాలనీకి చెందిన సుబ్రమణ్యం(74)గా గుర్తించి, అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.హెడ్ కానిస్టేబుల్ గుణయ్య, మహిళా పోలీస్ పావని ఈ దాడిలో పాల్గొన్నారు.

వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత



పండ్లు అందజేస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: వృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ఆశ్రమంలో ఉంటున్న వృద్ధులకు, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి దాతలు తమ వంతు సహాయం చేసేందుకు ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు కోరారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం నగరంలోని తపోవనంలో రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు తన వంతు సాయంగా వస్త్రాలు, మందులు, పండ్లు అందజేశారు. తహసీల్దార్ మురళీమోహన్, నిర్వాహకుడు ముత్యాలశెట్టి పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోమారు సీఎం జగనన్నను ఆదరించండి
- వై ఏపీ నీడ్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



బంగారుపాళెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: పేదల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. బుధవారం సాయంత్రం మొగిలివారిపల్లె గ్రామ సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అందించిన వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఏ సచివాలయ పరిధిలో ఎంతమందికి ఎంత లబ్ధి చేకూరిందనే వివరాలు ప్రజలకు తెలియాలనే బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూర్చిన మేలు, చంద్రబాబు చేసిన మోసాల గురించి నాయకులు ప్రజలకు వివరించాలని సూచించారు. జగనన్న ఇచ్చిన హామీలు ఏవిధంగా అమలు చేసి చూపించారో ప్రజలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్న జగనన్ననే మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం ఆయన గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, మొగిలివారిపల్లె, జయంతి సర్పంచ్‌లు శ్రీనివాసులు, వళ్లెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామల, జెడ్పీటీసీ సోమశేఖర్, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర, వైస్ చైర్మన్ సర్దార్, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి దొరస్వామి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు 155 కమ్మపల్లెలో..

యాదమరి: మండలంలోని 155 కమ్మపల్లెలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం 3 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్‌బాబు పాల్గొంటారని చెప్పారు. మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్



బంగారుపాళెం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, నాయకులు

- దళితుల విద్యాభివృద్ధికి చేసిన కృషి అజరామరం
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: విద్యతోనే దళితజాతికి వెలుగులు తెచ్చిన చాటిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం మండల కేంద్రం బంగారుపాళెంలో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితజాతిలో పుట్టి దేశం గర్వించేలా చరిత్రకెక్కిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. దళితుల విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. యువకులు అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని సూచించారు.

దార్శనికుడు అంబేడ్కర్

ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ దేశం కీర్తించదగిన గొప్ప దార్శనికుడు అంబేడ్కర్ అని అన్నారు. రాజ్యాంగ నిర్మాతగా ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎంతో పాటు పడ్డారని అన్నారు. రాజ్యాంగ రచయితగా, న్యాయ కోవిదుడిగా ఆయన దేశానికి చేసిన సేవలు అజరామరమని కొనియాడారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ దత్తాత్రేయరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు సర్దార్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్ కుమార్ రెడ్డి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని, ఇలాంటి పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం కావాల్సిన అవసరం ఉందని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రామభద్రాపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి పథకాల లబ్ధి వివరాల బోర్డుతో పాటు పార్టీ జెండాను ఆవిష్కరించారు. జేసీఎస్ కన్వీనర్ సాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు రజినీకాంత్, సూరి, త్యాగ, వేణుకిరణ్, ధరణి, జగదీష్, గురునాథన్, గుండుసాయి పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి



కృష్ణాపురం హైస్కూల్లో రికార్డులను పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

తవణంపల్లె: విద్యార్థుల్లో ప్రమాణాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీవైఈఓ చంద్రశేఖర్ ఆదేశించారు. మండలంలోని మాధవరం ప్రాథమిక పాఠశాల, కృష్ణాపురం హైస్కూల్‌ను సందర్శించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించి సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు చదవడం, రాయడం బాగా రావాలని సూచించారు. కృష్ణాపురం హైస్కూల్లో మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీశారు. డీవైఈఓతో పాటు తవణంపల్లె ఎంఈఓలు హేమలత, త్యాగరాజులు రెడ్డి, ఐరాల ఎంఈఓ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు చిత్రాల ద్వారా వివరిస్తున్న రైతులు

ఐరాల: చిత్తూరు ఏరువాక కేంద్రం వారి ఆధ్వర్యంలో ఏఓ వరలక్ష్మి బుధవారం తాడిపత్రి జేసీ దివాకర్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులకు వరి యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 35 యర్లంపల్లెలో బుధవారం విద్యార్థులు వ్యవసాయ క్షేత్రంలో విజ్ఞానాన్ని నేర్చుకుంటూ.. పంటలు వేసే సమయంలో కాలనుగుణంగా క్యాలెండర్, పంటల తెగుళ్లపై చిత్రరూపంలో రైతులు వివరించారు. అనంతరం ఆమె విత్తన శుద్ధి, నారుదశ, కాండం తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

స్కూల్ అభివృద్ధికి నిధులు వెచ్చించండి



మాట్లాడుతున్న ఎంఈఓ రమేష్‌బాబు

బంగారుపాళెం: పాఠశాలల అభివృద్ధికి స్కూల్ మెయింటెనెన్స్ నిధులను ఖర్చు చేయాలని ఎంఈఓ-2 రమేష్‌బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మండలంలోని మనబడి నాడు-నేడు ఫేస్-1, 2 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో కొళాయిలు, విద్యుత్ బల్బులు, ఇతర వసతుల ఏర్పాటు కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వినియోగించుకోవాలని తెలిపారు. అదే విధంగా నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



చిత్తూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు



పూతలపట్టులోశిక్షణ ఇస్తున్న తహసీల్దార్ విజయభాస్కర్

చిత్తూరు అర్బన్: ఎన్నికల కమిషన్, జిల్లా ఎలక్ట్రోరల్ అధికారి ఆదేశాల మేరకు ఏఈఆర్వో, నగర కమీషనర్ జె అరుణ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ పరిధిలో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్) లపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. నగర పాలక పరిధిలో చవటపల్లి, డి.వెంగనపల్లి పరిధిలో 14,15,16,17 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఓటు ఎలా వేయాలి, వేసిన ఓట్లు ఎలా గుర్తించాలి? ఓట్ల లెక్కింపు? ప్రజలు వేసిన ఓటు వీవీప్యాట్‌లో ఎలా కనిపిస్తుంది అన్న విషయాలను వివరించారు. ఈవీఎంలోని కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ ఏ విధంగా పనిచేస్తాయో అవగాహన కల్పించారు. మండల్ టీమ్, ఏసీపీ రామకష్ణుడు, బీఎల్వోలు పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలోని ఓటర్లకు తహసీల్దార్ విజయభాస్కర్ ఓటు హక్కుపై ఉచిత శిక్షణ కల్పించారు. మండలంలో 69, 70, 71, 72, 73 పోలింగ్ కేంద్ర పరిధిలోని ఓటర్లకు ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అంశంపై అవగాహన కల్పించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును తప్పక వినియోగించాలని సూచించారు. కార్య క్రమంలో డీటీలు మహేశ్వరి, మునికృష్ణ, బీఎల్వోలు, పీసీ అల్లి ముత్తు, గ్రామస్తులు పాల్గొన్నారు.